క్లుప్తంగా

నేడు భావనారుషి కల్యాణం

తిరువూరు: పద్మశాలీయుల దైవమైన భావనారుషి కల్యాణం ఆదివారం ఉదయం జరుగుతుందని పద్మశాలీయుల సంఘం పట్టణ అధ్యక్షుడు స్వర్గం నాగేశ్వరరావు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయ సమీపం మార్కండేయ నగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ భవన్‌లో ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తిరువూరు ఆర్డీఓ కె. మాధురి శనివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఓటర్లకు ఇబ్బందికరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను రాజకీయ పార్టీల నుంచి అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు ఉన్న పాఠశాలల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గంపలగూడెం మండలం పెనుగొలనులో రెండు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రం ఉన్నందున సమీప కేంద్రంలో కలపాలని పలువురు రాజకీయ పార్టీల నాయకులు కోరారు. తిరువూరు చింతలకాలనీ డొంక రోడ్డులోని ఎంపీపీ స్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, ఈ కేంద్రాన్ని వేరొక చోటికి మార్చాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహనరెడ్డి కోరారు. బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్, సీపీఎం, జనసేన ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



చాట్రాయి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. గతంలో చాట్రాయి విద్యార్థులు ఇంటర్ పరీక్షల కోసం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట వెళ్లాల్సి వచ్చేది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షా కేంద్రం స్థానిక హైస్కూల్‌లోనే ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు వ్యయ ప్రయాసాలు తగ్గడంపై వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

నూజివీడు: కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలోని ఆయన స్వగృహంలో నూజివీడు బీజేపీ నాయకులు శనివారం కలిశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కారు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మంత్రిని నాయకులు పరామర్శించారు. అనంతరం వీరు ఎమ్మెల్సీ సోము వీర్రాజును ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి, ఎం. రాజశేఖర్, జీఆర్‌కే రంగారావు, మాటూరి రవికాంత్, శివరాజు వసుంధరదేవి, మాగంటి వాసు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం

ఆగిరిపల్లి: స్థానిక శోభనగిరిపై వేంచేసి ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు, అనంత కృష్ణ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామివారికి చంద్ర ప్రభ వాహనంపై గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో డోలోత్సవం వైభవంగా నిర్వహించారు.

ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై వేయవద్దు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల భారం మోపొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలో జరిగిన విద్యుత్ అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.మహేష్, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సదుపాయాలు కల్పించాలి

కొండపల్లి జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానికులతో కలిసి కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం, సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన బాటలో ఆశాలు

- గత టీడీపీ ప్రభుత్వంలో వేతనాలకు ఇబ్బందులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెరిగిన వేతనాలు
- హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర



కొండపల్లి పీహెచ్‌సీ వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు నిరసన గళమెత్తారు. గత ప్రభుత్వంలో 10 హామీల అమలుకు ఒప్పందం కుదిరితే మూడు హామీలు అమలు చేశారు. మిగిలిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆశా వర్కర్లు ఈ నెల ఆరున రోడ్డెక్కి తమ నిరసన వ్యక్తం చేశారు.

ఆశ వర్కర్ల సేవలు ఇవి..

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహార లోపం గుర్తించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణుల ప్రసవాలు ప్రోత్సహించడం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పర్యవేక్షణ, మందుల పంపిణీ, ప్రభుత్వ సర్వేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో ఆశా (కమ్యూనిటీ హెల్త్ వర్కర్) వ్యవస్థను తీసుకువచ్చింది. వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి 2019 వరకు వారు అందించిన సేవలను బట్టి వేతనం ఇచ్చేవారు. వారిచ్చే వేతనం పీహెచ్‌సీలు, మండల కేంద్రాలకు తిరిగేందుకు సరిపోయేవి కావు.

గత టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు

2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఆశా వర్కర్లపై కనికరం చూపలేదు. ప్రభుత్వం కేటాయించిన వైద్య సేవలను బట్టి పీహెచ్‌సీలో కాన్పు చేయిస్తే రూ.300, చిన్నారులకు రోగ నిర్ధారణ వ్యాక్సినేషన్ వేయిస్తే రూ.150 ఇలా సేవలను బట్టి వేతనం ఇచ్చేవారు. ఒక్కో నెలలో రూ.200 నుంచి రూ.ఏడు వేల వరకు మాత్రమే వేతనంగా చెక్కు రూపంలో ఇచ్చేవారు. రూ.200 చెక్కు మార్చుకునేందుకు బ్యాంకులకు వెళితే బ్యాంక్ సిబ్బంది వెటకారపు చూపులతో ఆశాలు మానసికంగా కుంగిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొంతమంది చిన్న మొత్తం చెక్కులు మార్చుకునేందుకు బ్యాంకులకు కూడా వెళ్లేవారు కాదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 వేల వేతనం..

గత టీడీపీ ప్రభుత్వంలో అనేక అవమానాలు ఎదుర్కొని అరకొర వేతనంతో విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు 2019 నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. అప్పటి వరకు సేవలను బట్టి కేటాయించిన వేతనాన్ని ఒక్కసారిగా రూ.10 వేలకు పెంచింది. నాలుగున్నర ఏళ్లు సంతోషంగా విధులు నిర్వహించిన ఆశాలు 2024లో సార్వత్రిక ఎన్నికల ముందు మరిన్ని డిమాండ్లతో సమ్మెకు దిగారు. వారు పెట్టిన 11 డిమాండ్లలో అప్పటి ప్రభుత్వ పెద్దలు 10 సమస్యలు పరిష్కరిస్తామని, అదే ఏడాది జూన్ నుంచి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 2024 జూన్‌లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది.

డిమాండ్లు ఇవి..

ఆశాల డిమాండ్లలో పదవీ విరమణ వయస్సు, గ్రాట్యూటీ, ప్రసూతి సెలవులు పెంచినప్పటికీ కూటమి పెద్దలు ఆశాలను మెప్పించలేక పోయారు. గత ప్రభుత్వ హామీలు అన్నీ అమలు చేయాలని ఈ నెల 6న పెద్దఎత్తున నిరసన గళం వినిపించారు. కనీస వేతనం రూ.20 వేలు, ఆరోగ్య, ఉద్యోగ భద్రత, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తింపు, ఇన్సూరెన్స్ వంటి సేవలకు జీఓలు విడుదల చేయాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి



ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి. కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. మరణించిన వారికి మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ అందించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశాలకు కూడా కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ఎం.మహేష్, సీఐటీయూ మండల కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

తిరువూరు ఆర్డీఓ మాధురి



తిరువూరులో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ మాధురి



వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య

తిరువూరు: ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులతో పర్యావరణంతో పాటు ప్రజల ప్రాణాలకు హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ వీటి వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి అన్నారు. ప్రతి నెలా 3వ శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిస్పోజల్ టీ గ్లాసులు, మంచినీటి గ్లాసులు, అన్నం ప్లేట్లు, కప్పులు వేల సంవత్సరాల పాటు మట్టిలో కరగకపోవడంతో విష వాయువులు వెదజల్లుతాయని, వీటివలన మానవజాతికి ముప్పు తప్పదని ఆర్డీఓ హెచ్చరించారు. వేడి పానీయాలు, భోజనం కూడా ప్లాస్టిక్ ప్లేట్లలో, గ్లాసుల్లో తీసుకోవద్దని, దీనివలన త్వరగా జీర్ణ కోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్లాస్టిక్ నిషేధం పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

జి.కొండూరు: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడడం నిషేధించాలని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కార్మికుల ప్రతిజ్ఞ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు శనివారం ప్రారంభించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలిస్తామని ఉద్యోగులు, కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి నెలా వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనతోనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత..

మైలవరం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సివిల్ సప్లయిస్ జిల్లా ప్రత్యేకాధికారి ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. మైలవరం పంచాయతీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ అబ్దుల్ ధారియా, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మైలవరం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మంజుభార్గవి, కార్యదర్శి షేక్ రఫీ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మైలవరం ఆరో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతో గ్రామాల్లో పరిశుభ్రత..

ముసునూరు: కాలుష్యం తొలగించి, గ్రామాల్లో పచ్చదనం నింపే లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నూజివీడు డీఎల్పీఓ సుందరి అన్నారు. శనివారం గ్రామ సచివాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం..

చాట్రాయి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. శనివారం చాట్రాయిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: గొల్లపల్లి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కట్టెలేరు వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం వీడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ



కట్టెలేరుపై వరదలకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలిస్తున్న డీవీ కృష్ణ తదితరులు

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం వీడాలని కోరారు. గంపలగూడెం వచ్చిన ఆయన కట్టెలేరుపై శిథిలమైన వంతెనను శనివారం పరిశీలించారు. 2018లో వరదలకు దెబ్బతిన్న ఈ వంతెనను వెంటనే పునర్నిర్మిస్తామని అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారని, తదుపరి జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బీ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు వంతెనను సందర్శించి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పదే పదే చెప్పారని డీవీ కృష్ణ గుర్తుచేశారు. గత ఎన్నికల్లో కూడా ఈ వంతెన నిర్మాణాన్ని కూటమి మేనిఫెస్టోలో పెట్టి విస్తృత ప్రచారం చేసినా ఇంతవరకు ఫలితం కనిపించలేదని ఎద్దేవా చేశారు. 20 గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా చీమ కుట్టినట్లు లేని నేతలు ఇకనైనా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటరెడ్డి, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: 2025-26 విద్యా సంవత్సరం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కో-ఆర్డినేటర్, ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 31 వరకూ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ముసునూరు(బాలికలు), నాగిరెడ్డిగూడెం (బాలికలు), అప్పలరాజుగూడెం (బాలురు) గురుకులాల్లో ఐదో తరగతిలో 80 చొప్పున, 240 సీట్లు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

చాట్రాయి: సారాను నిర్మూలిద్దామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య పిలుపునిచ్చారు. శనివారం పోతనపల్లి తండాలో సారా తయారీ, అమ్మకందార్లకు సారా నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



చాట్రాయి: వేసవి ఎండలు క్రమేపీ పెరుగుతున్నాయి. మార్చిలో సాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు అప్పుడే మే నెల ఎండలను తలపిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. భానుడి భగభగలకు మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి నిత్యం రద్దీగా ఉండే సత్తుపల్లి -విజయవాడ రోడ్డు జన సంచారం లేక వెలవెలబోతున్నాయి.

నెమలిలో ఎడ్లబండ్ల లాగుడు పోటీలు

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల లాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను గ్రామ ప్రముఖులు బెల్లం మధుసూదనరావు, పామర్తి మల్లికార్జునరావు, రాజశేఖర్ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎడ్లబండ్ల యజమానులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఈ పోటీలు కొనసాగుతాయి.



స్వామివారి రథోత్సవం..

తిరుకల్యాణం అనంతరం వేణుగోపాలస్వామిని దేవేరులతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామంలో ఊరేగించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉంగుటూరు: బాలిక అదృశ్యంపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు గ్రామానికి చెందిన సుఖభోగి శ్రావణి ఈ నెల 9న గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని తన స్నేహితురాలి ఇంటికి వచ్చింది. స్నేహితురాలి ఇంటిలో కుటుంబ సభ్యుల మధ్య చిన్నపాటి సమస్య రావడంతో దానికి కారణం శ్రావణి అని భావించి స్నేహితురాలి తల్లి అనసూయ శ్రావణిని మందలించింది. దీంతో ఆందోళన చెందిన శ్రావణి అదేరోజు రాత్రి 9గంటలకు స్నేహితురాలి ఇంటి నుంచి వెళ్లిపోయింది. శ్రావణి తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఉంటుందని అనసూయ శ్రావణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి వాకబు చేస్తే ఆమె అక్కడకు వెళ్లలేదని తెలిసి పరిసర ప్రాంతాల్లో విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆత్కూరు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. బాలిక ఇంటి నుంచి వెళ్లినప్పుడు నీలి రంగు చుడీదార్, తెలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉంది. ఆచూకీ తెలిసినవారు ఆత్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫోన్ నంబర్లు 94911 52837, 94914 91311కు తెలియజేయాలని కోరారు.

నైపుణ్యాలు పెంపొందాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు డిగ్రీ కోసం చదవవద్దని, నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే రాణిస్తారని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ నాళ్ళా మురళి, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ముసునూరు: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు 600 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ జి.రాణి పరిశీలించారు.ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో రెగ్యులర్ విద్యార్థులు 594 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు ఆరుగురు పరీక్షలకు హాజరవుతారన్నారు.

నేడు దివ్యాంగుల క్రికెట్ టీం ఎంపిక

ముసునూరు: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా నూతన దివ్యాంగుల క్రికెట్ టీం ఎంపికలు జరుగుతున్నట్లు ఎంపీడీఓ జి.రాణి శనివారం తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం జరుగనున్న ఎంపికలకు మండలంలోని ఆసక్తి గల దివ్యాంగులు నేరుగా హాజరు కావచ్చన్నారు. శారీరక దివ్యాంగులు, అంధులు, బధిరులు, వీల్‌చైర్ కేటగిరీల్లో ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు.

పరీక్ష కిట్లు పంపిణీ

మైలవరం: వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం అభినందన సమావేశం నిర్వహించారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, పూర్వ విద్యార్థుల సహకారంతో పదో తరగతి విద్యార్థులు 50 మంది పరీక్ష కిట్‌లను అందజేశారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఆలుమ్ని అసోసియేషన్ కో-ఆర్డినేటర్ టి. అనిల్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 26 మంది ఎంపిక



నూజివీడు: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జంగంగూడెంలోని ఐటీఐ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. 41 మంది హాజరుకాగా 26 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీల్స్ ఇండియా, వరుణ్ మోటార్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె. ప్రవీణ్, కో-ఆర్డినేటర్ డి. రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలి

స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా జేడీ సుమలత



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా జేడీ సుమలత

ఇబ్రహీంపట్నం: యువత స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జాయింట్ డైరెక్టర్ బి.సుమలత పేర్కొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు శనివారం ఇబ్రహీంపట్నంలోని రాయల్ గార్డెన్‌లో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు అనేక ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాయని చెప్పారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిరుద్యోగుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బీఆర్ఆర్‌సీ రీజినల్ కో-ఆర్డినేటర్ జె.రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్డీఏ ఏపీడీ శ్రీనివాసరావు, కస్పాండెంట్ శారద, విజయవాడ సిటీ కో-ఆర్డినేటర్ అనిత పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సిద్ధం



చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో పరీక్ష పేపర్లు భద్రపరుస్తున్న ఎంఈఓ

చాట్రాయి: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు చాట్రాయి ఆర్‌సీఎం, జెడ్పీ హైస్కూల్లోని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌సీఎం పరీక్షా కేంద్రంలో 155 మంది, జెడ్పీ హైస్కూల్లో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించామని, పరీక్ష పేపర్లు స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచామన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లపై సమస్యల వెల్లువ

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ముత్తవరపు కల్యాణ మండపంలో శనివారం జరిగిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ పలువురు అర్జీలు సమర్పించారు. విజయవాడ విద్యుత్ రూరల్ డివిజన్ ఎస్ఈ వసంతరావు అధ్యక్షతన జరిగిన అదాలత్‌లో 11 విభాగాలకు చెందిన సమస్యలు అధికారుల దృష్టికి వినియోగదారులు తీసుకొచ్చారు.

పశువులకు టీకాలు

జి.కొండూరు: గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి ఎం. హనుమంతురావు అన్నారు. వెంకటాపురం గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం పర్యవేక్షించారు. మైలవరం ఏడీ హరిహరనాథ్, మండల పశు వైద్యాధికారి ఎస్. శైలజ పాల్గొన్నారు.